క్లుప్తంగా

దోమలతో రోగాలు వ్యాప్తి



గోపీనాథపట్నంలో ప్రదర్శనలో పాల్గొన్న వైద్య సిబ్బంది, మలేరియా అధికారి లక్ష్మణరావు

గణపవరం (ఉంగుటూరు): దోమల ద్వారానే పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెంది ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని, దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వై.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం గోపీనాథపట్నం, ఎ.గోకవరంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆరోగ్య సర్వే నిర్వహించి, కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి మురుగునీటి నిల్వలు, దోమల వ్యాప్తి, దోమల లార్వా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పలువురు మహిళలకు వారు అంట్లు తోమే ప్రాంతంలో, నీటి తొట్టెలు, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉంచిన పాత్రల్లో పెరిగిన దోమల గుడ్లు, లార్వాను చూపించారు. దోమలతో టైఫాయిడ్, మలేరియా, డెంగీ తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించి, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు సరోజని, అన్నపూర్ణ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చీరాలలో ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశం

దెందులూరు: ప్రకాశం జిల్లా చీరాల నగరంలో శనివారం నిర్వహించనున్న ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ కోరారు. శుక్రవారం మండలంలోని గంగన్నగూడెంలో ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందగ కృష్ణ మాదిగ, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. రాష్ట్రంలోని ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉద్యోగుల ప్రజా సేవ అభినందనీయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ ఉద్యోగులు తమ సంఘాల ద్వారా సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించడం అభినందనీయమని ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్‌రాజు అన్నారు. విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం సౌజన్యంతో ఈపీడీసీఎల్ డిస్కం ప్రధాన కార్యదర్శి తురగా రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్ పేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ప్రారంభించగా, ముఖ్యఅతిథిగా ఎస్ఈ సాల్మన్‌రాజు పాల్గొని మాట్లాడారు. ఇక్కడ గత 30 రోజుల నుంచి మజ్జిగ చలివేంద్రం కొనసాగుతోందన్నారు. తురగా రామకృష్ణ మాట్లాడుతూ నిత్యం 150 లీటర్ల చల్లటి మజ్జిగతో పాటు మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం నిరంజన్, డివిజన్ కార్యదర్శులు సీహెచ్‌పీసీ శ్రీనివాస్, నరసింహారావు, టౌను ఏడీఈ కృష్ణరాజా పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా అభివృద్ధి చెందాలి

ఏలూరు (టూటౌన్): యాదవులు అంతా ఐకమత్యంతో రాజకీయంగా అభివృద్ధి చెందాలని ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో యాదవులు రాణించాలని కోరారు. జిల్లా యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు శ్రీనివాసరావు (బుజ్జి), ప్రధాన కార్యదర్శి గొర్ల రామారావు, ఏలూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల గంగాధరరావు, దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడు దిమ్మిటి రమేష్, రాష్ట్ర నాయకుడు భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సమీపంలో రైల్వే బ్రిడ్జిపై 16వ నంబర్ హైవేపై ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులిచ్చిన సమాచారంతో ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. సుమారు 35 ఏళ్ల వయస్సున్న యువకుడి మెడలో రుద్రాక్ష మాల ఉందని, ప్యాంట్, షర్ట్ ధరించాడని, చెవిపోగులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించామన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రూరల్ ఎస్సై సెల్ నంబర్ 94407 96636కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కౌంటింగ్ రోజు అల్లర్లు సృష్టిస్తే రౌడీషీట్ నమోదు



బావాయిపాలెంలో రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై ఆర్. శ్రీనివాసు



కాశిపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు



గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పెదపాడు ఎస్సై, పోలీసులు



సూరప్పగూడెంలో మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

నిడమర్రు: ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే వారిపై రౌడీషీట్ తెరవాలని ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని ఎస్సై ఆర్. శ్రీనివాసు హెచ్చరించారు. శుక్రవారం బావాయిపాలెం, నిడమర్రు గ్రామాల్లో వివిధ పార్టీ నేతలతో ఎన్నికల నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీను మాట్లాడుతూ ఎన్నిక ప్రక్రియ ముగిసే వరకూ అన్ని గ్రామాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్‌లు అమల్లో ఉంటాయన్నారు. పార్టీ శ్రేణులు అభిమానించే పార్టీపై అభిమానాన్ని చూపాలే తప్ప ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, లేదా అనుమానస్పదంగా ఉండే వ్యక్తులుపై గ్రామ పెద్దలు నిఘా పెట్టి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశాల్లో ఆయా గ్రామాల్లోని ప్రధాన పార్టీల నేతలు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కేసులు

గణపవరం: గ్రామాల్లో ప్రజలందరూ రాజకీయ పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలని గణపవరం ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కాశిపాడు, చిలకంపాడులో ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ఎలాంటి ఆవేశ కావేశాలకులోను కాకుండా సంయమనంగా వ్యవహరించాలని సూచించారు. గొడవలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ దానికి అనుగుణంగా ప్రవర్తించాలని లేదంటే పోలీసు కేసులు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144వ సెక్షను 30 పోలీస్ యాక్టు జిల్లా వ్యాప్తంగా అమలులో ఉంటుందని అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక నిఘా

భీమడోలు: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు బనాయిస్తామని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం ఎన్నికల ఫలితాలు వెలువడనున్నందున శాంతి పరిరక్షణ కమిటీ సభ్యులు, పెద్దలు, యువకులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు, వివాదాలు సృష్టించిన వ్యక్తులపై తీసుకునే చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ముగిసిన ఎన్నికల కోడ్ 6వ తేదీ వరకు ఉంటుందని, గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉండాలని, వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లోని బైండోవర్ కేసులు, రౌడీషీటర్లను ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ ఉండగా కేసులు నమోదైతే వాటి పరిణామం తీవ్రంగా ఉంటుందన్నారు. స్నేహపూర్వక గ్రామాలు ఉండాలన్నారు. పోలీస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌పై అవగాహన

పెదపాడు: జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలు ఎన్నికల కోడ్ పాటించాలని పెదపాడు ఎస్సై శుభశేఖర్ తెలిపారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య, సీఐ శ్రీనివాసకుమార్ ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని కొత్తూరు పెదపాడులో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో కార్డెన్స్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాలపై ఇప్పటికీ పోలీసు కవాతు నిర్వహించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కోడ్ అమలు ఉందని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

300 మంది ఉపాధి కూలీలతో అభివృద్ధి పనులు



పెరుగ్గూడెం అంకన్నచెరువులో ఉపాధి పనులు చేస్తున్న 300 మంది కూలీలు

దెందులూరు: ఎండబారిన పడకుండా ఉపాధి కూలీలు త్వరితగతిన పనులు ముగించుకుని క్షేమంగా ఇంటికి చేరాలని పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, మండల టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణ్ అన్నారు. శుక్రవారం పెరుగ్గూడెం అంకన్న చెరువులో 300 మంది ఉపాధి కూలీలు పనులు చేశారు. కూలీల సంఖ్య, హాజరు శాతాన్ని పెరుగ్గూడెం ఫీల్డ్ అసిస్టెంట్ వి.శ్రీనివాస్ నమోదు చేశారు. మస్తర్లను మండల టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణ్ తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను మండల టెక్నికల్ అసిస్టెంట్లతో కలిసి సర్పంచ్ పరిశీలించారు.

నేటి నుంచి గ్రామాల్లో పెన్షన్ నగదు పంపిణీ



పి.శ్రీలత ఎంపీడీఓ

దెందులూరు: దెందులూరు మండలంలో గ్రామగ్రామాన శనివారం నుంచి 9,669 మంది లబ్ధిదారులకు రూ.2,90,57,500 నగదు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా అధికారుల ఆదేశాలకు అనుగుణంగా పెన్షన్ నగదు జమ చేస్తామని పి.శ్రీలత తెలిపారు. డీబీటీ విధానంలో 7,167 మంది లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు రూ.21,50,300 జమ చేస్తామన్నారు. 2,502 మంది లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి రూ.75,54,500 నగదు అందిస్తామన్నారు. నగదు పర్యవేక్షణ కార్యక్రమాన్ని తాను స్వయంగా అన్ని గ్రామాల్లో పర్యవేక్షిస్తానని ఎంపీడీఓ తెలిపారు.

ఘనంగా హనుమద్ జయంత్యుత్సవాలు



పెదపాడు: అప్పనవీడులో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



భీమడోలు: సూరప్పగూడెంలో స్వామి వారికి విశేష పూజలు చేస్తున్న అర్చకులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. అనంతరం గోత్ర నామాలతో పూజలు చేశారు. వెండి, బంగారు పుష్పాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా హోమాలు, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

దెందులూరు: గ్రామగ్రామాన శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు రామదండు దెందులూరు మండల కమిటీ నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. దెందులూరు రైల్వేగేటు వద్ద సింహాచలం పొలంలో వేంచేసియున్న బాల వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఉదయం 11 గంటల నుంచి మహా అన్నదానం నిర్వహించనున్నట్టు నూకరాజు వివరించారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

భీమడోలు: సూరప్పగూడెంలో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ జయంత్యుత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామి ఉత్సవాలు మేళాతాళాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలు, తమలాపాకుల అర్చనలు, తులసీ దళార్చనలు, విశేష పూజలు చేసారు. గ్రామంలోని భక్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. శనివారం ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించనున్నట్టు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా పందేలు

గణపవరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై కొందరు జోరుగా పందేలు కాస్తున్నారు. బూత్, వార్డు, గ్రామం, మండలం స్థాయిలో మెజార్టీలపై పందేలు సాగుతున్నాయి. ఒక ఓటు, పది ఓట్లు, వంద ఓట్లు మెజార్టీ అంటూ పందేలు కాసేవారు ముందుకు వస్తున్నారు. ఒకటికి రెండు రెట్లు, ఆరు హెచ్చు, ఏడు హెచ్చు, ఒక ఓటు మెజార్టీకి రూ.20 వేలు అంటూ సాగుతున్న పందేలను చూస్తే ఎవ్వరైనా నోరెళ్లబెట్టక తప్పదు. గతంలో డబ్బున్న మా రాజులే పందేలు కాసేవారు. ప్రస్తుతం వారు వీరు అన్న తేడా లేకుండా అందరూ పందేల్లో భాగస్వాములవుతున్నారు. ఒక్కో గ్రామంలో ఐదారుగురు యువకులు కలిసి ఒక్కొక్కరూ రూ.లక్ష, రూ.2 లక్షల వంతున వేసుకుని మరీ పందేలు కాస్తున్నారు. పరిస్థితి ఎంతవరకూ వెళ్లిందంటే పొరుగు రాష్ట్రాలు, పొరుగు జిల్లాల్లోని స్థానాల గెలుపోటములపై, మెజార్టీలపై పందేలు కాస్తుండటం విశేషం. ప్రస్తుత సాధారణ ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో పందాలు కాసేవారు రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం జరిగిన సాధారణ ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో పందేలు జోరుగా సాగుతున్నాయి. ఒక్క ఉంగుటూరు నియోజకవర్గంలోనే దాదాపు రూ. 100 కోట్లకు పైగా పందేలు కాసినట్లు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.వెయ్యి కోట్ల వరకూ పందేలు జరిగి ఉంటాయని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, ఒక పార్లమెంట్ పరిధిలో ఫలానా పార్టీకి ఒక్క సీటూ రాదని, రాష్ట్రంలో పార్టీలకు వచ్చే స్థానాల సంఖ్యపై రకరకాల పందేలు వేస్తున్నారు.

ఒక ఓటు మెజార్టీకి రూ.20 వేలు: గణపవరం మండలంలోని ఒక గ్రామంలో మరో విచిత్రమైన పందేలు కాశారు. ఆ గ్రామంలో ఫలానా పార్టీ అభ్యర్థికి మెజార్టీ రాదని, ఎన్ని ఓట్లు మెజార్టీ వస్తే ఓటుకు రూ.20 వేల చొప్పున ఇస్తామంటూ పందేలు కాస్తున్నారు. ఆ అభ్యర్థికి 100 ఓట్లు మెజార్టీ వస్తే ఓటుకు రూ.20 వేల చొప్పున 100 ఓట్లకు రూ.20 లక్షలు ఇవ్వాలన్నమాట. గతంలో నిడమర్రు మండలంలోని ఒక గ్రామంలో ఒక ఓటుకు రూ.లక్ష చొప్పున పందేలు కాశారు. ఆ గ్రామంలో ఒక అభ్యర్థికి వచ్చిన మెజార్టీ 250 కావడంతో ఓడిన వారు రూ.2.50 కోట్లు సమర్పించుకున్నారు.

పుస్తక జ్ఞానం వెలకట్టలేనిది



నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య

దెందులూరు: పుస్తకం జ్ఞానం వల్ల శాశ్వత ప్రయోజనం కలగడంతో పాటు మనిషి, సమాజ విలువ ఎలా నడుచుకోవాలో తెలియచేస్తుందని నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం దెందులూరులో పలువురు విద్యార్థులకు సామాజిక, విజ్ఞాన పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులు, పోటీ ప్రపంచం, మాధ్యమాల ప్రభావం, పోటీతత్వం వల్ల ప్రతి ఒక్కరిలో, ముఖ్యంగా యువతలో పుస్తక పఠనం చేసేవారి సంఖ్య తగ్గిందన్నారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రంథాలయాలను ఉపయోగించుకున్న ప్రతి వ్యక్తి ప్రపంచ జ్ఞానం పొందడంతోపాటు ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించేందుకు పుస్తకాలు సోపానమవుతాయన్నారు. తాను పోలీస్ శాఖలో ఉద్యోగం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వర కూ వివిధ ప్రాంతా ల్లో చిన్నారులు, యువతకు విజ్ఞానాన్ని పెంపొందించే 3,640 పైగా పుస్తకాలను ఉచితంగా అందజేసినట్టు డీఎస్పీ లక్ష్మయ్య అన్నారు.

నూకాలమ్మ రజత వస్త్రానికి వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి సుందరంగా అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మ వారి రజత వస్త్రం తయారీకి తిరుపతి త్రిపురసుందరి, రమేష్ దంపతులు 10 తులాలు, బుట్టాయిగూడెంకు చెందిన జె.ధనలక్ష్మి 5 తులాల వెండి, సూరె భాస్కరరావు, సత్యవతి దంపతులు రూ, 10,116లు ఆలయ అభివృద్ధికి అందించినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ తెలిపారు. పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ నిర్వహించగా, కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం, భక్తులు పాల్గొన్నారు.

ధూమపానంతో ఆరోగ్య సమస్యలు



గణపవరం పీహెచ్‌సీలో ధూమపాన వ్యతిరేక ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు

గణపవరం: ధూమపానం ఆరోగ్యానికి అన్నిరకాలు చేటు చేస్తుందని, ధూమపానం ఇతరుల ఆరోగ్యాన్ని పాడు చేస్తుందని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో ప్రజలతో ధూమపాన వ్యతిరేక ప్రతిజ్ఞలు చేయించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారులు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను ఏ రూపంలో తీసుకున్నా క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్య, గుండె సమస్యలు ఏర్పడి ప్రాణాంతకంగా మారుతుందన్నారు. ధూమపానం వల్ల పుట్టబోయే బిడ్డలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అందువల్ల ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా ధూమపాన వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైద్యాధికారిణి కె.ప్రియాంక ఆధ్వర్యంలో ధూమపాన వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించారు. చిలకంపాడులో పొగాకు వ్యతిరేక ప్రదర్శన నిర్వహించారు. ధూమపానం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు తదితరులు పాల్గొన్నారు. గణపవరం మండల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాశిపాడులో ధూమపాన వ్యతిరేక ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరేశ్వర్లు, అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



భీమడోలు లైబ్రరీలో ప్రతిజ్ఞ చేస్తున్న తుమ్మల ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్, చిన్నారులు

భీమడోలు: పొగాకు రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం సాయంత్రం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలబాలికలకు పొగాకు వద్ద కలిగే అనర్థాలు, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలను చైతన్యపర్చడం తదితర అంశాలపై చర్చాగోష్టి నిర్వహించారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు ఉత్పత్తుల వినియోగం మితిమీరిందని, తద్వారా చాలామంది వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. మండే సుధాకర్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు బానిసలుగా మారిన యువత బంగారు భవిష్యత్తుకు తీరని నష్టాన్ని తెచ్చుకుంటోందన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని కోరారు. తొలుత చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలి

ఏలూరు రూరల్ : ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఏపీ వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి అన్నారు. శుక్రవారం ఆయన ఏలూరు రూరల్ మండలంలో మాదేపల్లి, జాలిపూడిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం నిర్వహణకు రూ.2.50 లక్షల కోట్లు విడుదల చేయాల్సిండగా, కేంద్ర ప్రభుత్వం రూ.63 వేల కోట్లు మాత్రమే విడుదల చేస్తోందని చెప్పారు. నిధుల మంజూరులో జాప్యం చేస్తూ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. పోరాటం ఫలితంగా 2005లో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. పని దినాలు 200 రోజులకు పెంచి, కూలీలు పని చేసే ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంతోపాటు ప్రయాణ ఖర్చులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు గ్రామాల కూలీలకు సైతం పని కల్పించాలని అధికారులను కోరారు. సీఐటీయూ నాయకుడు జె.గోపి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు శిక్షణ

పోలవరం రూరల్: పోలవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల–2లో శుక్రవారం మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు శిక్షణ ఇచ్చామని ఎంఈఓ జె.సురేష్‌బాబు తెలిపారు. ఎంఈఓ–2 సీహెచ్ నరేంద్రరాయ్ మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ, వంట చేసే విధానాన్ని వివరించామని తెలిపారు.

వ్యాపార ప్రాంతాల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలి



వట్లూరులోని సీఆర్ఆర్ మహిళా కళాశాల వద్ద వాడి పడేసిన గ్లాసులను చూపిస్తూ కూల్ డ్రింక్ వ్యాపారిని వివరణ అడుగుతున్న డీపీఓ

పెదపాడు: వ్యాపారులు తమ వ్యాపార స్థలాల్లో తప్పకుండా డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులో ఆయన పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. శీతల పానీయాలు తాగిన గ్లాసులు గుట్టలుగా పడేయడాన్ని గమనించారు. కూల్ డ్రింక్ వ్యాపారం చేసేవారు పేపరు గ్లాసులను పక్కనే పడేయడంతో వారితో మాట్లాడి బాధ్యతారాహిత్యంగా మెలగడంపై మండిపడ్డారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు గ్రామాలను పరిశుభ్రం చేస్తుంటే వ్యాపారులు బాధ్యత లేకుండా పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రజాఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ వ్యాపారాలు చేస్తే ఊరుకునేది లేదని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొబైల్ కూల్ డ్రింక్ వాహనానికి తాళం వేశారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడటంతో సీఆర్ఆర్ కాలేజీ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై డీపీఓ నిర్వహించిన తనిఖీలకు ప్రాధాన్యత సంతరించుకుంది.